
ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





దొంగతనాలను అరికట్టడంపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: వాసవినగర్ లో ఇటీవల రెండు ఇళ్ల ల్లో దొంగతనాలు జరిగిన నేపథ్యంలో కందుకూరు సిఐ వెంకటేశ్వరావు వాసవి నగర్ వాసులకు దొంగతనాలపై, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. వాసవి నగర్ లో సి సి కెమెరాలు లేకపోవడం తో దొంగను పట్టుకోవడం ఆలస్యం అవుతుందని, అదే సీసీ కెమెరాలు కమిటీ వారు ఏర్పాటు చేసిఉంటే దొంగ త్వరగా ట్రేసవుట్ అవుతాడాని సి ఐ తెలిపారు. ఊర్లకు వెళ్లే ఇంటివారు విలువైన వస్తువులు భద్రపరుచుకొని, వాచ్ మెన్ కు, పక్కింటి వారికి చెప్పి వెళ్లాని సూచించారు.మంచి తాళాలు ఇంటి కి వేసుకోవాలన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఇంటివారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సైబర్ నేరం జరిగిన ఒక గంటలోపు 1930 కి కాల్ చేస్తే మీ సొమ్ము లాక్ చేస్తారు. తెలియని వ్యక్తులు లకు ఫోన్ లో చెప్పొద్దని కోరారు.పిల్లలకు తల్లి దండ్రులు మంచి విలువలు నేర్పించాలని కోరారు.సోషల్ మీడియా లో అనవసరమైన పోస్టులు షేర్ చేస్తే అది చట్ట రీత్యా నేరం అని అన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ ఐ మహేంద్ర నాయక్, కమిటీ సభ్యులు, వాసవినగర్ వాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వరరావు

సింహ'పురి' భయపడుతోంది..!

◆ వరుసగా దోపిడీ, దొంగతనాలు, హత్యలు
◆ పెట్రేగిపోతోన్న ఆకతాయిలు
◆ ఇద్దరు సిఐలపై వేటు
◆ నేరస్తులకు రాజకీయ నేతల మద్దతు

సింహపురి ప్రశాంతతను కోల్పోతోంది.. అశాంతి... ఆందోళనలు... భయానికి నిలయంగా మారుతోంది...చిన్న చిన్న విషయాలకే హత్యలు చేసేస్తున్నారు.. .ప్రతిరోజూ దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు.. పోలీసులు కేవలం ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు..కొందరు రాజకీయ నేతలు నేర స్తులు, ఆకతాయిలు, దొంగలు, రౌడీషీటర్లకు మద్దతుగా నిలుస్తున్నారు..దీంతో చేసేదేమి లేక పోలీసులు తూతూ మంత్రంగా ఉద్యోగాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి.. 18నుంచి25 యువత రౌడీలు, గూండాలుగా మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, వ్యసనాలకు బానిసలుగా మారిపోతున్నారు.. చిన్న చిన్న విషయాలకు కత్తిపడుతున్నారు. నెల్లూరు నగరంలో వరుసగా హత్యలు, దోపిడీ, దొంగతలు ఎక్కువయ్యాయి. నగర శివారు ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా మారింది.. కొందరు ఏకంగా కిరాతకమైన హత్యలు చేస్తున్నారు. మద్యం మత్తులో నెల్లూరు నగరంలో యువకులు వీరం సృష్టిస్తున్నారు.. పోలీసులు సిసి కెమెరా పెట్టినా..అరెస్ట్‌లు చేసి జైలుకు పంపినా లెక్క చేయడం లేదు... రాజకీయ చోటా నేతలు మద్దతుతో మరింత రెచ్చిపోతున్నారు. అభివృద్ధి చెందు తోన్న నగరంలో ఇలాంటి సంఘటనలతో ప్రజలలో ఆందోళన కనిపిస్తుంది. వరుస సంఘటనల నేపథ్యంలో నగరంలోని ఇద్దరు సిఐలపై రాష్ట్ర డిజిపి వేటు వేశారు..


హత్యను పరిశీలిస్తున్న డిఎస్‌పి జి. శ్రీనివాసరావు



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరం భయపడుతోంది... నేరస్తులు రోజు రోజుకు రెచ్చిపోతున్నారు... పోలీసుల భయం కనిపించడం లేదు... రాజకీయ నేతల మద్దతుతో పోలీసులనూ సైతం లెక్క చేయడం లేదు.. వైసిపి. టిడిపి చోటా నాయకులు సహకారం అందిస్తుండడంతో విచ్చలవిడిగా రోడ్లపై కత్తులు పట్టుకు తిరుగుతున్నారు.. చిన్న చిన్న విషయాలకే హత్య చేస్తున్నారు... మద్యం, గంజాయి, మత్తుపదార్థాలు సేవిస్తున్న యువత చిన్నా, పెద్దా చూడడం లేదు. ఈ పరిస్థితుల్లో నగరంలో అశాంతి కనిపిస్తోంది. ఇటీవల కాలంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు... " కత్తిపడుతోన్న యువత " పేరుతో ప్రజాశక్తి ప్రత్యేక కథనం ఇచ్చింది.. రౌడీ మూకలు, ఎవరూ మాట్లాడినా చంపేస్తా...పొడిసేస్తానంటూ భయభ్రాంతులు చేస్తున్నారు. నెల్లూరునగరంలో ప్రధానంగా శివారు ప్రాంతాలు, పొదలకూరు రోడ్డుతోపాటు అనేక ప్రాంతాలు ఇందుకు కేంద్రాలుగా మారుతున్నాయి. సాయంత్రానికి మాగుంట లేవుట్, చిల్డ్రన్‌పార్కు, కెవిఆర్, గాంధీ బొమ్మ ప్రాంతాలకు వస్తున్న ముఠాలు రాత్రికి తమ ప్రాంతాల్లో చక్కర్లు కొడుతున్నారు. సుందరయ్య కాలనీ ప్రాంతంలో ప్రతి రోజూ దొంగలు దొంగతనాలు చేస్తున్నారు. స్థానిక యువత రాత్రుల్లో గస్తీ తిరుగుతున్నారు. పోలీసులు అడపా దడపా పెట్రోలింగ్ చేస్తున్నా గుట్టుచప్పుడుకాకుండా కొట్టేస్తున్నారు. పోలీసులు పట్టుకుపోయినా చోటా నాయ కుల ఫోన్లతో విడుదల చేస్తున్నారు. 1980-92 కాలంలో కొందరు పెద్ద వయస్సు కలిగిన వ్యక్తులు అక్కడక్కడా రౌడీయిజం, గూండాయిజం చేసే పరిస్థితులుండేవి. ప్రభుత్వాలు కొంత కంట్రోల్ చేశాయి. అప్పటి తరం చనిపోయారు. ఇటీవల కాలంలో 15 నుంచి 25 సంవత్సరాలు వయస్సు కలిగిన యువత రౌడీయిజం, గుండాయిజం అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. నగరంలోని ప్రతి ప్రాంతంలో వీరు ఎక్కువైపోయారు. బ్లేడ్ బ్యాచ్‌లు అధికంగా కనిపిస్తున్నాయి. రాజకీయ నాయకులు వీరిని తమ రాజకీయాలకు ఉపయోగించు కోవడంతో పోలీసుల భయం కనిపించడం లేదు. నడిరోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నారు. మందుతాగితే చిన్నా పెద్దా తేడా చూడడం లేదు. 15-18 వయస్సువారు మత్తులో ఎవరినీ లెక్క చేయడం లేదు.

వరుసగా దారుణ హత్యలు..!

నెల్లూరు నగరంలో ఇటీవల వరుస హత్యలు అత్యంత కిరాతకంగా జరుగుతున్నాయి. ఇందులో ప్రధానంగా రౌడీ షీటర్లు చనిపోతున్నప్పటికీ నగరంలో ప్రశాంత వాతావరణం దెబ్బతింటుంది. శుక్రవారం రాత్రి అయ్యప్పగుడి వద్ద అందరూ చూస్తుండగానే కత్తితో అతిదారుణంగా హత్య చేశారు. ఇందుకు పెద్ద కారణం కనిపించడం లేదని తెలుస్తోంది. మద్యం మత్తులో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితులు కనిపిస్తున్నాయి. మద్యం, మత్తు పదార్థాల వాడకంతో యువత ఎవరినీ లెక్క చేయడం లేదు. పిల్లలు, మహిళలు, యువత బయట తిరగాలంటే భయపడి పోతున్నారు.. ఎప్పుడు ఎవరు ఎందుకు గొడవ పెట్టుకుంటారో...ఏం చేస్తారో తెలియడం లేదు. కొందరు పిలిచి మరీ గొడవకు దిగుతున్నారు. ఏమైనా అంటే దాడులకు దిగుతున్నారు. శివారు ప్రాంతాల్లో అయితే నేరస్తులు నగరంలోని ప్రధాన సెంటర్లలో తిష్ట వేస్తున్నారు. ఏదో రాజకీయ పార్టీకి అనుబంధంగా తిరగడం, చోటా నాయకులకు శిష్యులుగా మారి 'దంతో తమకు భయం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రశాంతతకు నెల్లూరు కేంద్రం అలాంటి చోటా ఇలాంటి అరాచక శక్తులు రెచ్చిపోతున్నారు. పోలీసులు రౌడీ షీటర్లు, దొంగలు, నేరస్తులపై నిఘా పెట్టడం లేదు. కౌన్సెలింగ్ ఇవ్వడం లేదు. ఎవరిని తీసుకొచ్చినా రాజకీయ నేతలు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతుండడంతో శాంతిభద్రతలు అన్నట్లు కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారు. నగరంలోని ప్రతి ప్రాంతంలో వీరి ఎక్కువైపోయారు. ఇటీవల వరుసగా పెన్నా నది వద్ద ఏటి పండుగ వద్ద ఇద్దరు యువకుల మధ్య చెలరేగిన వివాదంతో మరో బ్యాచ్ అత్యంత దారుణంగా హత్య చేశారు. ముత్తుకూరు అండర్ బ్రిడ్జి వద్ద కత్తి రవి అనే యువకుడిని రాత్రి ప్రత్యర్థులు కత్తులతో నరికి చంపారు. ఇందుకు పాత కక్షలుగా తెలిసింది. చిన్న వివాదానికి వనంతోపు సెంటర్‌లో ఓ యువకుడిని మరి కొందరు యువకులు కత్తులతో పొడిచి చంపారు. నగరం శివారు ప్రాంతంలో ఇటీవల కాలంలో సుమారు 20 హత్యల వరకు జరిగినట్లు సమాచారం. నెల రోజుల క్రితం పొదలకూరు రోడ్డులో చింటు (సుజన్ కృష్ణారెడ్డి) ప్రత్యర్థులు సాయంత్రం సమయంలోనే కిరాతకంగా హత్య చేశారు. పొదలకూరురోడ్డు ప్రాంతంలో హత్య షరా మామూలుగా మారింది. చిన్న చిన్న వివాదాలు, రౌడీయిజం చూపించడానికి యువకులు బ్యాచ్‌లు నడుపుతున్నారు. ఇందులో ఎక్కువ భాగం రాజకీయ నేతల నీడలోనే ఉంటున్నారు. కొద్ది కాలంగా రాజకీయ సభలకోసం, ఓట్లు ఇలా అనేక కారణాలతో వీరిని పోషిస్తున్నారనే విమర్శలున్నాయి. రాజకీయ పలుకుబడి ఉండడంతో పోలీసులకు లెక్కచేయడం లేదు. గతంలో వీరిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అణిచి వేసే వారు. ఇప్పుడు కొద్దిగా తగ్గినట్లు కనిపిస్తోంది. యువతలో నిత్యం కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు, పరివర్తన తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నతనం నుంచి అల్లరి ముద్దుగా పెంచుకుంటున్న పిల్లలు ఒక దశ తరువాత హంతకులు, దొంగలు, మందుబాబులుగా మారడంతో తల్లిదండ్రులు కోల్పోతున్నారు. ఇటీవల కొందరు ఎస్‌పి ఫిర్యాదు చేశారు. మందుబాబుల పరిస్థితి దారుణంగా ఉంది. మద్యం సేవించి రాత్రిపగలు తేడా లేకుండా రోడ్లపైకి వస్తున్నారు. పిల్లలు, మహిళలు, సాధారణ జనం భయపడుతున్నారు. నెల్లూరు నగరంలో వరుస హత్యల నేపథ్యంలో డిజిపి సీరియస్ అయ్యారు. నవాబుపేట సిఐ అన్వర్‌బాషా, వేదాయపాలెం సిఐ శ్రీనివాసులురెడ్డిలపై వేటు వేశారు. వివరణ పంపారు. నగరంలోని పోలీసులకు ఇది ఒక హెచ్చరికగా చెప్పొచ్చు. ఇప్పటికైనా పోలీసు లాఠీకి పనిచెప్పి నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించక పోతే నెల్లూరులో ప్రశాంతి పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇది పోలీసులతో కాకుండా రాజకీయ నేతలు, ప్రజలు భాగస్వాములు కావాల్సి ఉందని ప్రజలు అంటున్నారు. శివారు ప్రాంత ప్రజలు మరింతగా భయంతో కనిపిస్తున్నారు. సమాజంలో వచ్చిన మార్పును ప్రత్యేక అధ్యయనం చేసి, నేరాలు అరికట్టకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం కనిపిస్తోంది. రాజకీయనేతలు, పోలీసులు, కొంత కాలం ఉంటారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అందరూ కలిసి కట్టుగా పనిచేస్తే నేరాలు అదుపు చేయగలరని ప్రజలు ఆశపడుతున్నారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు


మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎన్.యువరాజ్

ప్రజావసరాలను గుర్తించి అన్ని స్థాయిల్లోని డేటాను అనుసంధానం చేసి జిల్లాను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎన్.యువరాజ్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల కార్యదర్శి యువరాజ్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత కలెక్టర్ ఒ. ఆనంద్ వివిధ రంగాల్లో జిల్లా ప్రగతిని ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి యువరాజ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా మాత్రమే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, కిందిస్థాయిలో అధికారులు చేసిన ప్రయోగాల ద్వారా మాత్రమే ఉన్నతంగా తీర్చిదిద్దుతాయన్నారు. జిల్లాలోని అధికారులతో స్ట్రాటజిక్ కోర్ గ్రూప్‌ను తయారుచేసి ప్రజావసరాలను తెలుసుకొని, అందుబాటులో ఉన్న వనరులతో జిల్లాను అన్ని రంగాల్లో అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. నేటి ఆధునిక సమాజంలో వివిధ మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించడం సులువని, దానిని క్రోడీకరించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. జిల్లాలోని పర్యాటక, బీచ్, ఇతర ప్రముఖ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ టూరిజం ప్యాకేజీ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేటి యువత ట్రెక్కింగ్ చేసేందుకు ఆసక్తిగా ఉన్న దృష్ట్యా, అటవీ ప్రాంతంలోఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్స్ గా మారేందుకు తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా జిడిపి పెరిగేందుకు సర్వీస్ సెక్టార్ లోని అగ్రికల్చర్, హార్టికల్చర్ తదితర రంగాల్లో వృద్ధి సాధించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనిస్తూ, వెనుకబడిన వాటిని ప్రోత్సహించాలన్నారు. టిడ్కో గృహాలలో ఎక్కువ మంది చేరే విధంగా, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలు రొటీన్‌గా చేసే ఉత్పత్తులు కాకుండా కొత్తవాటిపై దృష్టి పెట్టేవిధంగా మెప్మా అధికారులు కృషి చేయాలన్నారు. స్కూల్ హెల్త్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా బాలికల రక్తహీనత లేకుండా చేయొచ్చన్నారు. పేదలకు ఉపాధి, భూగర్భ జలాలు పెంచే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. పథకాలు సమర్థవంతంగా అమలు చేయుటకు అధికారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్ఓ ఉదయ భాస్కరరావు, ఆర్డీఓలు అనూష, వంశీ కృష్ణ, పావని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :నగరంలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్, డిఎస్ఆర్ లేఅవుట్ పార్థసారథి నగర్‌లో ఆయన పర్యటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలలకే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ , యువనేత, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ సహాయ సహకారాలతో నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక చొరవతో శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కందుకూరు :గతంలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా , పిఎస్ హెచ్‌ఎంలుగా ,స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొంది తిరిగి ఎస్జిటిలుగా రివర్షన్ పొందిన ఉపాధ్యాయుల సమావేశం శుక్రవారం కందుకూరు సిపిఐ ఆఫీసులో జరిగింది. ప్రస్తుతం విడుదల చేసిన ఎస్జీటీ బదిలీల సీనియారిటీ జాబితాలో రివర్షన్ పొందిన ఉపాధ్యాయుల సీనియారిటీని వారు రివర్స్ పొందిన తేదీ ని పరిగణలోకి తీసుకొని బదిలీల సీనియారిటీ జాబితాలో చివరన జూనియర్ గా చూపిస్తున్నారని దీనివలన ఎంతో సీనియర్స్ మైన మాకు బదిలీలలో తీవ్ర అన్యాయం జరుగుతుం దని పేర్కొన్నారు. ఒక పాఠశాలలో సర్ ప్లస్ పోస్టు ఉంటే మాకన్నా జూనియర్స్ ఉన్నప్పటికీ మమ్ములనే జూనియర్ గా పరిగణిస్తున్నారని సమావేశంలో పాల్గొన్న టీచర్లు తెలిపారు. రివర్షన్ పొందే సమయంలో ఆర్థికంగా నష్టం జరుగుతున్నప్పటికీ ఆరోగ్య, కుటుంబ కారణాల రీత్యా తాము రివర్షన్ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా వచ్చామని తెలియజేశారు. ఈ బదిలీలలో మేము ఎస్జీటీగా మొదట చేరిన తేదీ నుంచే మా సీనియారిటీని పరిగణలోకి తీసుకొని సీనియారిటీ జాబితాలో మా పేర్లు చేర్చి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో రివర్స్ పొందిన ఉపాధ్యాయులు ముప్పూరు మాల్యాద్రి , జల్లి తిరుమలరావు ,రాచపూడిశంకర్ ,షేక్‌అబ్దుల్లా, ఎం కొండయ్య, బిటిఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కల్లగుంట మోహన్ రావు ,ఎస్టియు నాయకులు పోకూరి మాలకొండయ్య పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు


దుర్గంధంతో అవస్థలు..

ప్రజాశక్తి-సైదాపురం:విద్యార్థులకు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల భవనం ముందు మురుగునీరు నిలిచి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామంలోని తాగునీరు పైపు లీకై వర్షపు నీరు పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. చాగణం హరిజనవాడ ప్రాథమికోన్నత పాఠశాల భవనం వద్ద ఈ పరిస్థితి నెలకొంది. పాఠశాల భవనం ముందు మురుగు గుంతగా మారింది. గ్రామ సర్పంచ్ పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఈ మురుగు గుంతల్లో పందులు, కుక్కలు, బర్రెలు స్వైరవిహారం చేస్తుండటంతో పాఠశాల అపరిశుభ్రంగా మారింది. దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు, తెలిపారు.



స్కూల్ బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి-ఉలవపాడు: మండలంలోని కోటిరెడ్డి గుంట యానాది కాలనీలో హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు తమ కుమార్తె శ్రీ తేజస్విని పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పాఠశాలకు వెళ్లే చిన్నారులకు స్కూల్ బ్యాగులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ కాలనీలో చిన్నారులు సుమారు ఒక కిలోమీటరు దూరం ఉన్న పాఠశాలకు రోజూ నడిచి వెళ్లి చదువుకుంటారన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో వీరికి అవసరమైన స్కూల్ బ్యాగులు పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు మనం అందించే విద్యా సామగ్రి, గిఫ్ట్ లు వారికి నూతన ఉత్తేజాన్ని కలిగిస్తూ చదువు పట్ల ఆసక్తి కలిగించుటకు తోడ్పాటు ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుని వరలక్ష్మి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నందన్

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.సూర్యతేజాను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిషనర్ పోస్టు ఖాళీ ఏర్పడింది. ఇప్పటి వరకు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న వై.ఓ.నందన్‌ను ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.






మృతురాలు కనకమ్మ (ఫైల్)

'కూరపాటి' సోదరులకు మాతృవియోగం

పలువురు సిపిఎం నేతలు నివాళి

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్

మండలంలోని చినలాటరిపి గ్రామం సిపిఎం సానుభూతి పరులు, కూరపాటి ఉమాపతి రెడ్డి, జనార్ధన్, కోటి రెడ్డిల తల్లి కూరపాటి కనకమ్మ (92) గుండెపోటుతో గురువారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందింది. శుక్రవారం నివాసం చిన లాటరిపి గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. మృతి చెందిన వెంటనే సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎం. మోహన్ రావు, మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, మూలె వెంగయ్య మంగలి పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు, టి.దయాకర్, కేపీ నరసయ్య, నెల్లూరు పట్టణ నేతలు పి. సూర్యనారాయణ, ఆర్. శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, గుడ్లూరు ఏరియా కన్వీనర్ జి వెంకటేశ్వర్లు, మండల నాయకులు, ఎం.జాలయ్య, ఎన్. వెంకటేశ్వర్లు, ఈ బాలయ్య, కొట్టే వెంకయ్య గుత్తి మల్లికార్జున, కోమరగిరి అంజయ్య తదితరులు అంతిమయాత్రలో పాల్గొని, కనకమ్మ భౌతికకాయానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ, కూరపాటి అంజిరెడ్డి, కనకమ్మకు, గ్రామంలో మంచి గుర్తింపు ఉందన్నారు. కనకమ్మ కుమారులు, ఉమాపతి రెడ్డి, జనార్ధన్, కోటిరెడ్డి, ఉన్నత చదువుల కోసం, కావలి, నెల్లూరు, పట్టణాలలో చదువుతూ, వామపక్ష విద్యార్థి సంఘమైన, ఎస్ఎఫ్ఐ లో చురుకుగా పనిచేశారన్నారు. ఆమె రెండవ కుమారుడు జనార్ధన్ పూర్తి కాలం కార్యకర్తగా జిల్లాలో పనిచేశారన్నారు. వీళ్లందరూ విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తున్నప్పటికీ, కనకమ్మ ప్రోత్సహించే వారని కొనియాడారు. పేదలన్న పేద ప్రజల అన్న ఆమెకు ఎక్కడలేని ప్రేమ అని అన్నారు. చనిపోయేంత వరకు కనకమ్మ కష్టపడి పనిచేసే మనస్థతత్వం మెండుగా ఉందని. కొనియాడారు. ఉపాధ్యాయ నేతలు, వేణు, మాధవ, సతీష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్, మొగిలి శివ పార్వతి, లక్ష్మీపతి రెడ్డి, జలదంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని ఇస్కపాలెం సెంటర్లోని క్రైస్తవ ఆరాధన మందిరం (ప్రకాశించు దీపం)లో శుక్రవా రం గుడ్‌ఫ్రైడే ఆరాధనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఫెలోషిప్ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ కన్వీనర్, పాస్టర్ కుందవరం బాబి ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. అన్ని చర్చిలలో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. పాస్ట ర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గుడ్ ఫ్రైడే సందేశం ఇచ్చారు.

మండలంలోని కోడూరు సముద్ర తీరం లో వెలసిన శ్రీ వేళాంగిణి మాత ప్రార్థనా మందిరంలో శు క్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. చర్చ్ ప్రార్థనా గురువులు లూకాస్ రాజు ఆధ్వర్యం లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, వీధుల్లో శిలువను ఊ రేగించారు. ఫాదర్ లూకాస్ రాజు గుడ్ ఫ్రైడే ప్రాధాన్యతను వివరించారు. ఈ ప్రార్థనలలో సహాయ గురువులు సాగర్, బ్రదర్ జోసఫ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మామపై అల్లుడు దాడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మామపై అల్లుడు దాడి చేసి గాయపరిచిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ దాడి గురించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలమేరకు.. సౌత్ ఆములూరు గ్రామం అరుంధతీ యవాడకు చెందిన చింతగుంట పెంచలయ్యపై, పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆయన అల్లుడు కాకుమాని పురుషోత్తం, ఆయన తండ్రి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పెంచలయ్యకు తీ వ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా ఈ ఘర్షణలో అడ్డుగా వచ్చిన వంగిపాడి శీనయ్యపై కూడా నిందితులు దాడి చేశారు. ఈ దాడిలో పెంచలయ్య తలపై కొట్టడంతో ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో శీనయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. దాడిలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహ న

ప్రజాశక్తి-కందుకూరు: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కనిగిరి రోడ్డు లో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లో డెమో కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెట్రోల్ బంకులో సిబ్బందికి అందరికి రానున్న వేసవిలో జరుగు అగ్ని ప్రమాదాలు, పెట్రోల్ కొట్టించుకునే వాహనం లకు దగ్గర తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా పెట్రోల్ బంకులో జరుగు ఆయిల్ ఫైర్స్ వంటి వాటిపై అవగాహన కల్పించి అలాంటి ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి టెక్నిక్ విషేస్ వినియోగం డెమో చేసి తదనంతరం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ , పోస్ట్ ఆఫీస్ సెంటర్ , పామూరు బస్టాండ్ సెంటర్ లలో కరపత్రాలు అంద జేశారు.


కళ్యాణంలో పాల్గొన్న ఎంఎల్ఎ ఇంటూరి

ఘనంగా శ్రీసీతారామస్వామి కళ్యాణం

ప్రజాశక్తి-కందుకూరు : ఉలవ పాడు మండలం, కరేడు పంచాయతీ వాక గ్రామంలో శ్రీ సీతారాముల స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం జరిగిన శ్రీ సీతారా మస్వామి కళ్యాణ మహోత్స వంలో కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.. ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం చేసి ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి స్కూల్‌కూ ఒకే నిష్పత్తిలో ఉపాధ్యాయులను ఇవ్వాలి

ప్రజాశక్తి -నెల్లూరు నెల్లూరు నగరంలో పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిలి సురేష్ ప్రభుత్వం ప్రాథమిక తరగతులు ఉన్న అన్నీ స్కూల్స్‌లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఒకే విధంగా ఉండేలా చూడాలని ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు, మిగిలిన ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూళ్ల ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిలో తేడాలు ఉండే విధంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను కేటాయిస్తుందని, అన్నీ రకాల స్కూల్స్‌లో ప్రాథమిక తరగతులు బోధించే ఎస్జీటీ పోస్టులు కేటాయిం చడంలో వ్యత్యాసాలు ఉండటం సరికాదన్నారు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి విధానాన్ని బేసిక్ ప్రైమరీ స్కూల్, ఫౌండేషన్ స్కూల్స్ కు కూడా వర్తింపజేయాలని తెలిపారు.

సప్త నదుల జలంతో వేడుకలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు నియోజక వర్గంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపు నిచ్చారు.శుక్రవారం ఆయన ఆత్మకూరులో ఏర్పాట్లు పరిశీలిం చారు. ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు ఆత్మకూరు నియోజక వర్గం లో ఘనంగా నిర్వహించ బోతున్నా మన్నారు. నియోజకవర్గం నుంచి మండలస్థాయి నాయకులంతా సేవా కార్యక్ర మాల్లో భాగస్వాములవ్వాలని పిలుపుని చ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీర్ఘాయుష్షును కోరుతూ మహా యజ్ఞం ఘనంగా నిర్వహించబోతున్నామన్నారు. కార్లు, బైక్‌ల మీద కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలి కోరారు. ఆత్మకూరులో ఘనంగా సిఎం చంద్రబాబు 75వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించి చంద్రబాబునాయుడుకి ప్రతి ఒక్కరీ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ ప్రజల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్టింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక ఆస్పత్రులలోని నిరుపేదలకు, రోగులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశా మన్నారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాల యం, బస్ స్టాండ్‌ల వద్ద పెద్దఎత్తున కార్యక్రమాలు లకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న క్రీడా ప్రాంగణంలో ఉదయం 9గం.ల నుంచి మహా హోమం ప్రారంభం కానుందన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సేవలు ఆంధ్రప్రదేశ్ కి ఎంతో అవసరం అన్నారు. ఆంధ్రప్రదేశ్ ని అభివద్ధి పథంలో నడిపించే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పని చేసిన ఏకైక నాయకుడు ఆయనే నన్నారు. ఉమ్మడి రాజధానికి మహానగరాన్ని నిర్మించారని, ..నేడు నవ్యాంధ్రకు కూడా అమరావతి నిర్మాణానికి పూనుకున్నా న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి పుట్టినరోజు ఆత్మకూరు నియోజక వర్గంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా మన్నారు. 75వ పుట్టినరోజు ఆత్మకూరులో చిరస్థాయిగా నిలవాలన్నారు. టీడీపీ సభ్యత్వాల అనంతరం కుటుంబ సారథుల ఏర్పాటులో ఆత్మకూరు నాలుగోస్థానంలో ఉందన్నారు.

ముత్తుకూరుకు మహర్దశ తీసుకొస్తాం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి


మొక్కలు నాటుతున్న ఎంఎల్ఎ సోమిరెడ్డి

ముత్తుకూరును మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడంతోపాటు, మహర్దశ తీసుకొస్తామని ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పి4 విధానంలో అభివృద్ధిలో భాగస్వాములు కానున్న ముత్తుకూరు పంచాయతీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య, కలెక్టర్ ఓ.ఆనంద్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రకటించిన పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, పీఆర్వో వేణుగోపాల్, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ కేఎం రామ్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. మొదటగా రెన్యూబల్ ఎనర్జీ, శానిటేషన్, ఎడ్యుకేషన్ ఎంపవర్మెంట్ అంశాలపై ప్రత్యేక దష్టి పెట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. స్టేడియం నిర్మాణంతో పాటు శ్మశానం అభివద్ధి బాధ్యతలను కూడా చేపట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి కోరారు. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ కు ఎంపికైన కృష్ణపట్నం హైస్కూలు విద్యార్థినులు విష్ణుప్రియ, కె.పూజిత, బి.మిత్రిత, ముత్తుకూరు హైస్కూలు విద్యార్థిని ఎ.పూజిత అభినందించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎ ప్రజాప్రతినిధులు, అధికారులు, అదాని ప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ నాగ అనూష, డ్వామా పీడీ గంగాభవాని, తహశీల్దార్ స్వప్న, ఎంపీడీఓ నాగమణి, పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.



టిడిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు వాకిచర్ల వీర ప్రతాప్ (బాబు) కాలికి ఇటీవల శస్త్రచికిత్స జరగడంతో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గూటూరు మురళీ కన్నబాబు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు కన్నబాబుకు శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని పలు విషయాలపై పిచ్చాపాటిగా చర్చించారు. కన్నబాబు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండాలని ప్రతిపక్ష వైసిపి అబద్ధపు ఆరోపణలను తిప్పికొట్టాలని, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయం కోసం అందరు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని కన్నబాబు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు డాక్టర్ ఖాజామియా, షేక్ అఫ్జల్, మాజీ ఎంపిటిసి షేక్ ఖాదర్ బాషా, షేక్ యస్దాని, నీలం గోవిందయ్య, షేక్ రఫీ, సయ్యద్ అస్లాత్, నలిశెట్టి శ్రీను, చదలవాడ కిషోర్, వాకిచర్ల మస్తానయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



'రన్ ఫర్ జీసస్'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి బిట్రగుంట

రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ జి.శామ్సన్ బాబు పేర్కొన్నారు. బోగోలు మండలం రెవరెండ్ డాక్టర్ జి సాంసంగ్ బాబు చర్చిలో విలేకరుల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్సన్ బాబు, సిహెచ్ నాగరాజు మాట్లాడుతూ 19వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు ఆరాధన టీవీ ఛానల్ వారి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బోగోలు మండలంలోనీ 16 పంచాయతీలలోనీ చర్చిల నుండి భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవ. డా. జి.శంసన్బాబు, రెవ.సిహెచ్.నాగరాజు, రెవ.ఎబినేజర్, రెవ.ఎ.స్తెఫన్, రెవ.బి.రవికుమార్, రెవ.జి.రమేష్, రెవ.పి.శాంసన్ సంఘ పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-కోవూరు


మండలంలోని పలు ప్రార్థన మందిరాలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు బక్తి శ్రద్ధలతో చేశారు. అలాగే కోవూరు శారా బి లాక్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చలో శుభ శుక్రవారం ఆరాధనలు వైభవంగ జరిగాయి. యేసుక్రీస్తు సిలువలో పలికిన 7మాటలను పలువురు క్రైస్తవ సోదరి, సోదరులు ధ్యానించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు 40 రోజులపాటు ఉపవాసం ఉండి ఈ దినాలలో ప్రతి దినం సాయంత్ర కాలంలో యేసుప్రభుల వారి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు ఎంతో భక్తి శ్రద్దలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు 3 గంటల వరకు జరిగి ముగించారు. పాస్టర్ రెవరెండ్ దావులూరి రాజేష్, చైర్మన్ కాకాణి రత్నానంద్ రావు, వైస్ చైర్మన్ మైలా ఫ్రాన్సిస్, సెక్రటరీ తుమ్మలపెంట మోహన్, కోశాధికారి నావూరు కుమార్, స్త్రీలా సమాజం కమిటీ మరియు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోవూరు శారా బి లాక్ మెమోరియల్ సంఘం మరియు, యవ్వనస్తులు, ఎగుదల చంద్రశేఖర్, ముసలి దేవపాల్ సీతల పానీయా లు అందచేశారు.



రక్తదానం గొప్పది..

ప్రజాశక్తి - కావలి

డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ పామూరు శివప్రసాద్ సోదరులు సమాజానికి అమూల్యమైన సేవలు అందిస్తున్నారని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్ర వారం తమ తల్లి పామూరు ఉమా 5వ వర్ధంతిని పురస్కరించుకొని డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శివప్రసాద్, పామూరు రాజాలు శ్రీధర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామూరు విశ్వనాథం, ఉమదంపతులు చిన్న గ్రామంలో కష్టపడి వ్యవసాయం చేస్తూ తమ కుమారులు శ్రీధర్, శివప్రసాద్‌లను మెడిసిన్‌లో, రాజాను ఫార్మసీలో మాస్టర్ డిగ్రీలు చదివించారన్నారు. తల్లితండ్రుల స్ఫూర్తితో డాక్టర్ శ్రీధర్ సోదరులు, పట్టణంలో మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవడతో పాటు, పేదలకు ఉపయోగపడే పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారన్నారు. డాక్టర్ శ్రీధర్ రెడ్‌క్రాస్ తలసేమియా ఆసుపత్రికి గౌరవ వైద్యాధికారిగా, పాలక మండలి సభ్యునిగా సేవలు అందిస్తున్నారని వివరించారు. తమ తల్లి స్మారకంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని రవికుమార్ పేర్కొన్నారు. ఈ శిబిరం డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఝాన్సీ దంపతులతో పాటు 36మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు డాక్టర్ శ్రీధర్ తండ్రి పామూరు విశ్వనాథం, పామూరు కామేశ్వరయ్య – కామాక్షమ్మ దంపతులు ప్రశంసాపత్రాలు, పండ్లు అందజేశారు. ముందుగా పామూరు ఉమా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, కోశాధికారి ఏ మధుసూదన్ రావు, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎస్‌కె. అబ్దుల్ నయీమ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణానికి చెందిన పేద విద్యార్థిని సాయి ప్రియకు కావలి పట్టణం ప్రముఖ వ్యాపారవేత్త, సంయుక్త సేవా సంస్థ గౌరవ సభ్యులు వేలూరు జయచంద్ర నాయుడు శుక్రవారం వారి కార్యాలయంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత వేలూరు జయచంద్ర నాయుడు, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత వేలూరు జయచంద్ర నాయుడు మాట్లాడుతూ సాయి ప్రియ చిన్న వయసులోనే తన తండ్రిని కోల్పోయిందని, అప్పటి నుండి ఆమే తల్లి బట్టలు కుట్టి కుటుంబాన్ని పోషిస్తూ సాయిప్రియను ఎం.సి.ఎ. వరకూ చదివించారని తెలిపారు. ప్రస్తుతం సాయిప్రియ తల్లి అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితం కావడంతో కాలేజీలో కట్టాల్సిన ఫీజును కట్టలేని కారణంగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ అన్నీ కాలేజీలోనే ఉన్నాయని తెలిపారు. సంయుక్త సేవాసంస్థకు సాయిప్రియ గురించి తెలియడంతో దాతల సహకారంతో సాయి ప్రియకు అవసరమైన సర్టిఫికెట్స్ ఇప్పించేందుకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర కషి చేస్తూ ఉన్నాడని తెలిపారు. నేడు సాయిప్రియకు తను రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. సాయి ప్రియ సర్టిఫికెట్స్ తెచ్చుకొని మంచి ఉద్యోగం చూసుకోని తన తల్లికి మంచి వైద్యం చేయించాలని తెలిపారు. సంయుక్త సేవాసంస్థ అధ్యక్షుడు సురేంద్ర చేస్తున్న సేవలను అభినందించారు. సాయిప్రియ మాట్లాడుతూ తన సర్టిఫికెట్స్ తెచ్చుకోవడానికి ఆర్థికసాయం అందజేసిన వేలూరు జయచంద్ర నాయుడుకి, తనగురించి దాతలకు తెలియజేసి తనకు సహాయం అందేలా చేస్తున్న సురేంద్ర అన్నకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

రామన్న చెరువు హాంఫట్..!

- పెట్రేగిపోతున్న మట్టి మాఫియా..
- ఆగని అక్రమ దందా..
- మందలించినా మారని తీరు.
- అధికారుల ఆదేశాలు సైతం బేఖాతర్.



రామన్నచెరువులోని ఎర్రమట్టిని జెసిబితో ట్రాక్టర్లకు ఎత్తుతున్న దృశ్యం



శివాజీ నగర్ వెంచర్‌లో తెల్ల శుద్ధమట్టి మధ్య రోడ్లకు ఎర్రమట్టి తోలుతున్న ట్రాక్టర్

ప్రజాశక్తి-కందుకూరు

వలేటివారిపాలెం పంచాయతీ పరిధిలోని రామన్న చెరువు అధికారుల మెతక వైఖరితో కనుమరుగవుతోంది. 20రోజులుగా రామన్నచెరువులోని మట్టిని నాలుగైదు జేసీబీలు, 20కి పైగా ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నప్పటికీ అధికారులు చీమకుట్టినట్లు కూడా లేదు. ప్రకృతి సంపదను కాపాడి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చాల్సిన అధికారులు తమదేం పోయింది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల నాయకులు కొందరు కుమ్మక్కై రామన్నచెరువు మట్టిని జాతీయ రహదారి సమీపంలోని కెజీవీబీ స్కూల్ పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన శివాజీనగర్ అనే వెంచర్ కు అక్రమంగా తరలించారు. చెరువులోని మట్టిని పెద్ద పెద్ద గుంటలు పెట్టి తోడేస్తుంటే భూగర్భ జలాలు ఎండిపోయి భవిష్యత్తులో నీటి కష్టాలు తప్పవని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 1, 2 తేదీలలో మట్టి అక్రమ తవ్వకాలను ప్రారంభించినప్పుడే కొందరు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల నుండి కనీస స్పందన కూడా కరువైంది. పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోవడంపై భారీ స్థాయిలో ముడుపులు చేతులు మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల ఆదేశాలు బేఖాతర్..

రామన్నచెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న అధికార పార్టీ నాయకులను సంబంధిత శాఖ అధికారి ఇటీవల పిలిపించి హితోపదేశం చేశారు. నాయకులు మాత్రం తమది అధికార పార్టీ అంటూ సదరు అధికారి సూక్తులను ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఓవైపు ప్రజలు, మరోవైపు మీడియా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ నాయకులు మాత్రం ఒక్క నిమిషం కూడా తమ పని ఆపకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి వెంచర్ పనిని చక చకా పూర్తి చేశారు. అధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ రామన్న చెరువు నుండి అక్రమంగా తవ్విన శుద్ధమట్టిని జాతీయ రహదారికి సమానంగా తమ వెంచర్‌కు మెరక తోలేశారు. గతంలో తవ్విన ప్రదేశానికి సమీపంలోనే తూర్పు వైపునా మళ్లీ ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టారు. అక్రమంగా తోలిన తెల్ల మట్టిపై ప్రస్తుతం వెంచర్ కు ఎర్రమట్టితో రోడ్లు వేసే పని కూడా దాదాపు పూర్తి చేశారు. తమకు ఎలాంటి సంబంధమూ లేదు.. రెవెన్యూ అధికారుల వింత పోకడ. రామన్న చెరువు అక్రమ మట్టి తవ్వకాలపై స్థానిక రెవెన్యూ అధికారులకు ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చెరువులతో మాకు ఎలాంటి సంబంధం లేదు. అంతా ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ వాళ్ళదే బాధ్యత అని చెప్పడంపై స్థానికులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రామన్నచెరువు లోనిమట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నప్పటికీ మండల మేజిస్ట్రేట్‌గా ఉన్న అధికారి కనీసం ఆ ప్రదేశానికి వెళ్లి చూసిన పాపాన కూడా పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రికవరీపై అధికారుల మీనమేషాలు. అక్రమ మట్టి తవ్వకాలపై ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు రికవరీపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. జరిమానా వేశాం.. ఇదిగో.. అదిగో.. అంటూ కాలం గడిపేస్తున్నారు. అధికారులు సదరు నాయకులను పిలిచి మాట్లాడుతున్నప్పటికీ వెంచర్ నిర్వాహకులు మాత్రం చాలా పకడ్బందీగా మట్టి తవ్వకాలు మాత్రం ఆపకుండా వెంచర్‌కు పూర్తిస్థాయిలో మట్టిని తోలుకొని తమ అధికార జులుం ప్రదర్శించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపించాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమార్కులు శివాజీ నగర్ వెంచర్‌కు తోలిన మట్టిని క్షుణ్ణంగా పరిశీలించి పూర్తిస్థాయిలో రికవరీ చేసి ప్రకృతి సంపదను పరిరక్షించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



చీకటిమయంలో ఉన్న ఎస్‌సి కాలనీ

అంధకారంలో ఎస్‌సికాలనీ

- అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమని గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి-దుత్తలూరు

దుత్తలూరు మండలం నందిపాడు ఎస్‌సి కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగక రాత్రి వేళలో బయటికి రావాలంటే ఎక్కడి నుంచి ఏ విషపురుగు వస్తుందో అని తెలియక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు అయితే ఉన్నాయి గానీ వాటికి వీధి దీపాలు వెలగక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఎన్నో సార్లు పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి ఒకరి మీద ఒకరు సాకులు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సి కాలనీ వాసులు మాట్లాడుతూ రాత్రి అయితే చాలు బయటికి రావాలంటే భయమేస్తుందని వాపోయారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా, తెలిసీతెలియనట్టు, చూసీ చూడనట్టు మాకేమి పట్టదు అన్నట్టు వ్యవహరిస్తున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగే విధంగా చూడాలని తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

21న ముస్లిం జెఎసి ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-కావలి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ, ముస్లిం ఆస్తులను స్వాధీనం చేసుకునే కుట్రలో భాగమేనని ముస్లిం జెఎసి నాయకులు ఆరోపించారు. ఈ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ 21న సోమవారం ఉదయం 9 గంటలకు కావలి పట్టణంలోని జెండా చెట్టు వద్ద నుంచి ర్యాలీగా బయల్దేరి ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జేఏసీ నాయకులు షేక్ నషీర్ అహ్మద్, ఎంబి ఎఫ్ రెహమాన్, షేక్ షారుక్, వామపక్ష నాయకులు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భారత రాజ్యాంగం అన్ని మతాలకు వారి ఆస్తులను నిర్వహించుకునే హక్కును కల్పించిందని, అయితే కేంద్ర ప్రభుత్వం ఈ హక్కును కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ చట్టంలో ముస్లిం నేతలను వక్ఫ్‌బోర్డు సభ్యులుగా చూపించడం కేవలం మొసలి కన్నీరు కార్చడమేనని ఇది ముస్లిం మత ఆస్తుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని వారు దుయ్యబట్టారు. దేశంలోని ముస్లిములు, ప్రజాస్వామికవాదులు, కార్మికులు, అన్నివర్గాల ప్రజలు ఈ వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని వారు తెలియజేశారు. బాబ్రీ మసీదు కూల్చివేత నుండి మొదలుకొని ఆర్టికల్ 370 రద్ధ, ఎన్ఆర్‌సి వంటి చట్టాలను అమలు చేసే వరకు కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా బాపిస్టు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ముస్లిం సోదరులు, మైనారిటీలు, వామపక్ష నేతలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ముస్లిం జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం జెఎసి కమిటీ నాయకులు జమీర్, జిలానీ, మహబూబ్ బాషా, ఎస్డీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

20న సిఎం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట మండల పరిధిలో నిర్వహించే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొనాలని, మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు పత్రికా ముఖంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని మండల పరిధిలో ఘనంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం ఆదేశాల మేరకు.. పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని ప్రతి ఒక్కరూ పండగల భావించి ప్రతి గ్రామంలో కూడా వేడుకలు నిర్వహించాలన్నారు. మంత్రి ఆనం పార్టీ నేతలకు సూచించడం జరిగిందని కావున.. ఉదయం మండల కేంద్రాల్లో వేడుకలు నిర్వహించి మధ్యాహ్నం నుండి నియోజకవర్గ కేంద్రానికి చేరుకోవాలన్నారు.

గుడ్‌ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. యేసు క్రీస్తు అనుసరించిన శాంతిమార్గం, శిలువలో పలికిన ఏడు మాటలు కోసం, ప్రపంచ శాంతికోసం, సందేశం ఇచ్చారని ఫాస్టర్లు సందేశం ఇచ్చారు. ఒకరికొకరు శు భాకాంక్షలు తెలియజేసుకునుకున్నారు. కార్యక్రమంలో సంఘపెద్దలు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మండలంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో ఉపవాస ప్రార్థనల నిర్వహించారు. విశ్వనాథరావుపేటలోని హెూరేబు ప్రార్థనా మందిరం పాస్టర్ రెవరెండ్ డాక్టర్ డానియల్ బాబు, బోగోలు, రామస్వామి పాలెం ఎన్‌టిబిసి చర్చి పాస్టర్లు రెవరెండ్ ఎబినేజర్, రెవరెండ్ పాస్టర్ రమేష్ బాబు, ప్రత్యేక ప్రార్థనలకు దైవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంఘ కాపరులు చంద్రహాస్, ఎల్.సుధీర్ బాబు, మార్కు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - ఉదయగిరి



మాట్లాడుతున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వం నూతనంగా వక్ఫ్ ఆస్తులపై సవరణ పేరుతో తీసుకొచ్చిన నల్లచట్టాన్ని నిరసిస్తూ పట్టణంలో శుక్రవారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి పెద్ద మసీద్ ప్రాంగణం వరకు నిర్వహించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ముస్లింలపై కక్ష గట్టి వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. అందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలపడం బాధాకరంగా ఉందన్నారు. మతసామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్న వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని లేకపోతే పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. వక్ఫ్ చట్టంను వివరించి నష్ట లాభం పైలాధికారి, జెవివి, సిపిఎం ప్రజాసంఘ వక్తులు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు షేక్ దస్తగిరి అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు అడ్వకేట్ కె.వి.శేషారెడ్డి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, వర్క్ బోర్డు సుభాన్, మైనార్టీ నాయకులు సయ్యద్ సమీ, జిల్లా ఉద్యమ నాయకులు డాక్టర్ వేణుగోపాల్, తెదేపా మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, జిల్లా కో ఆప్షన్ నెంబర్ షేక్ గాజుల తాజుద్దీన్, సిపిఎం మండల నాయకులు కాకు వెంకటయ్య, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షులు షేక్ ముత్తుజా హుస్సేన్, ప్రజా సంఘాల నాయకులు, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కావలి అభివృద్దే ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కావలి

కావలి అభివృద్దే తన ధ్యేయమని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం కావలి పట్టణంలోని 39వ వార్డులో ఇంటింటికీ ఎంఎల్ఎ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఇంటింటికీ వెళ్లి వార్డులోని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అప్పటికప్పుడు తీర్చగల సమస్యలను తక్షణమే పరిష్కరించారు. ప్రతి సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ 'సమస్య మీది – పరిష్కారం నాది' అనే నినాదంతో కావలి పట్టణంలోని ప్రతి వార్డులో పర్యటిస్తూ ఉన్నానని తెలిపారు. 39వ వార్డు ఎక్స్‌టెన్షన్ ఏరియాలో ఉందని, అనేక సమస్యలు పేరుకొని పోయి ఉన్నాయని తెలిపారు. గతప్రభుత్వ వైఫల్యం ఇక్కడ పుష్కలంగా కనిపిస్తోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వ పాలకులు విఫలమయ్యారన్నారు. ఇక్కడ ఎక్కువగా విద్యుత్ సమ స్యలు కనిపిస్తున్నాయని, రెండు నెలల్లో ఓల్టేజ్, ఇతర విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. అవసరం అయిన చోట ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లువేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అస్తవ్యస్తమైన లేఅవుట్ల వల్ల డ్రెయినేజీ వ్యవస్థ దారుణంగా మారిందని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామన్నారు. ఈ ఏడాది చివరిలోపు 39వ వార్డులో సిమెంట్ రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యానికి చరమగీతం పాడుతామని తెలిపారు. కావలిలో రామరాజ్యాన్ని నడిపిస్తామన్నారు. సామాన్య, పేద ప్రజలు జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని తెలిపారు. కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్, తహశీల్దార్ పి.శ్రావణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి



షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా కావలి పట్టణంలోని జవహర్ భారతి కాలేజీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌ను ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. క్రీడలను ప్రారంభించిన ఆయన సరదాగా కాసేపు షటిల్ ఆడారు. క్రీడాకారులను పరిచయం చేసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. గెలిచినప్పుడు ఒదిగి ఉండాలని, ఓడినప్పుడు కృంగి పోకుండా తిరిగి విజయం కోసం ప్రయత్నించాలని క్రీడాకారులకు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఒత్తిడిని తగ్గించుకోవడానికి కాసేపు ఆటలు ఆడాలని తెలిపారు. చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా షటిల్ టోర్నమెంట్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులను అభినందించారు.

రక్తదానం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-కావలి



తలసేమియా బాధిత చిన్నారులకు అండగా సాయిశ్రీ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ అల్లం శ్రీని వాసులు, డాక్టర్ పిట్టి పద్మశ్రీలు రక్తదాన శిబిరం నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం సాయిశ్రీ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డాక్టర్ కె.సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలిలో రెడ్ క్రాస్ తలసేమియా ఆసుపత్రిలో పలువురు చిన్నారులకు ఉచితంగా రక్తం, మందులు, పౌష్టిక ఆహారం అందజేస్తున్నారని, నెల్లూరు జిల్లాతో పాటు ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన తలసేమియా వారియర్లు చికిత్స పొందుతున్నారని, వేసవి కారణంగా రక్తనిల్వలు తగ్గడంతో సాయిశ్రీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ అల్లం శ్రీనివాసులు, డాక్టర్ పిట్టి పద్మశ్రీ రక్తదాన శిబిర నిర్వహణకు ముందుకు రావడం మంచి పరిణామమని, ఇతరులకు తప్పక స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య, వైద్యేతర సేవలు అందించేందుకు రెడ్ క్రాస్ ఐఎంఎ, రోటరీ క్లబ్‌లు కలసి పనిచేస్తున్నాయన్నారు. వేసవి కాలంలో సహజంగా రక్తకేంద్రాలలో రక్తనిల్వల కొరత ఏర్పడుతుందని, తద్వారా తలసేమియా చిన్నారులతో పాటు ప్రసవించే తల్లులు, రోడ్డు ప్రమాదభాధితులు ఇబ్బందులకు గురవుతారని, దానిని అధికమించేందుకు ఒక ప్రణాళిక ప్రకారం శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ అల్లం శ్రీనివాసులు, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డిలతో పాటు 40మంది రక్తదానం చేశారు. సాయిశ్రీ హాస్పిటల్ పిఆర్ఓ బాషా, కొండబిట్రగుంటకు చెందిన బ్లడ్ డోనార్ మోటివేటర్ విజయ్ రక్తదాతలను సమీకరించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కోవూరు

నూతనంగా నియమించిన వైసిపి కోవూరు నియోజకవర్గ మహిళా సమన్వయ కమిటీ సభ్యులతో మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర వైసిపి పిఏసిఎస్ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి నెల్లూరులోని వారి నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతానికి ఏ విధంగా కృషి చేయాలో మహిళా కమిటీ సభ్యులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరి చలపతి రావు, ఎపి ఎల్డియే చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు పూండ్ల అచ్యుత్ రెడ్డి, విడవలూరు మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం మండల అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి, బుచ్చి నగర అధ్యక్షులు షేక్ షాహుల్, కోవూరు మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, కోవూరు టౌన్ అధ్యక్షులు శివుని నరసింహారెడ్డి, కొడవలూరు మండల పార్టీ అధ్యక్షులు చెమట శేషగిరి, వైసిపి సీనియర్ నాయకులు కోడూరు వెంకటసుబ్బారెడ్డి, కలువ బాల శంకర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

చికిత్సకు సాయం

ప్రజాశక్తి-సంగం : జెండాదిబ్బకు చెందిన సురేష్ బుచ్చిరెడ్డిపాలెంలో సెలూన్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోకు గురవడంతో నెల్లూరులో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే రూ.8లక్షల వరకు ఖర్చయింది. చికిత్స అందించేందుకు కుటుంబం ఇబ్బందులు పడుతుండడంతో ఐటిడిపి వారు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో స్పందించిన ఆయన సురేష్ పరిస్థితి తెలుసుకున్నానని, వైద్యసాయానికి తగుచర్యలు చేపడతామని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆయన (ట్విట్టర్) ఎక్స్ వేదికగా తెలియజేశారు.